గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- బల్దియా పరిధిలో మూడు ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగుల, కలెక్టర్


కొత్తపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, మున్సిపల్ చైర్మన్

కార్పొరేషన్, సెప్టెంబర్ 15: కరీంనగర్‌లో సోమవారం జరుగనున్న వినాయక నిమజ్జనోత్సవాలకు నగరపాలక సంస్థ సర్వం సిద్ధం చేసింది. నిమజ్జన కేంద్రాలు మానకొండూర్, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో రాత్రిళ్లు సమస్యలు రాకుండా భారీగా లైటింగ్ సదుపాయాలను కల్పించారు. అలాగే ప్రతి మండపం నుంచి నిమజ్జనానికి వెళ్లే రోడ్లన్నింటికీ ఇప్పటికే మరమ్మతులు చేయించారు. శోభాయాత్రలో కూడా ఎక్కడా సమస్యలు రాకుండా అన్ని ప్రాంతాల్లో లైటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా టవర్‌సర్కిల్ వద్ద ఇప్పటికే పెద్ద ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశారు. నిమజ్జన కేంద్రాల వద్ద భారీ వినాయకులను నిమజ్జనం చేసేందుకు వీలుగా క్రేన్లు సిద్ధం చేశారు. కొత్తపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజుతో కలిసి పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

నగరంలో వినాయక శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఉదయం మానకొండూర్ చెరువు కట్ట వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు చింతకుంటలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడా నిమజ్జనానికి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా నిమజ్జనాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 15: పట్టణంలో వినాయక నిమజ్జనం కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్ ప్రధాన రహదారిపై ఉన్న కేసీకెనాల్ వద్ద నిమజ్జన స్థలంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా డ్యూటీలు కేటాయించారు. శోభాయాత్రకు ఎలాంటి అవాంతరాలు లేకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూట్‌మ్యాప్ సిద్ధం చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. శోభాయాత్ర రూట్లలో విద్యుత్ తీగలు వేలాడకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక ఆదివారం తొమ్మిదో రోజు కావడంతో మండపాల వద్ద అన్నదానం చేసేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆసక్తి చూపారు. పట్టణంలోని 28వ వార్డులో సూర్యతేజ యూత్ అసోసియేషన్ వినాయక మండపం వద్ద బీఆర్ఎస్ నాయకుడు గందె శ్రీనివాస్, 5వ వార్డులోని గణేశ్ యూత్ ఆధ్వర్యంలో కొండపాక శ్రీనివాస్, తదితరులు అన్నదానం చేసి భక్తిని చాటుకున్నారు. పలు గణేశ్ మండపాల వద్ద జరిగిన కుంకుమార్చన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


హుజూరాబాద్ టౌన్: కేసీకెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

నారదాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వినోద్ కుమార్

నారదాసు లక్ష్మణ్‌రావుకు కేక్ తినిపిస్తున్న వినోద్ కుమార్

కార్పొరేషన్, సెప్టెంబర్ 15: బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు 69వ జన్మదినం సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ నారదాసు నివాసంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నారదాసు లక్ష్మణ్ రావు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్ గౌడ్, గంటల రేణుక, రోజా, సువర్ణ, శోభ, నయీం, లింగరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్టేడియంలో నరేందర్ రెడ్డి ప్రచారం

ప్రచారంలో భాగంగా ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 15 : జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మమేకమయ్యారు. పట్టభద్రులతో మాట్లాడారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్న వారు అనేక విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఖ్యాతి గడిస్తారని పేర్కొన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. విద్యారంగంపై పూర్తి అవగాహన కలిగి, సమాజంలో ఎదురవుతున్న సమస్యలు తెలిసిన తనకు పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఒకరి అరెస్ట్

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 15: హుజూరాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్ అనుచరుడినంటూ ఓ వ్యక్తి నాగార్జున డెయిరీ యజమానిని ఫోన్‌లో 15లక్షల రూపాయలు డిమాండ్ చేసిన ఆడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కాగా, ఈ వ్యవహారంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. సదరు ఆడియో తన ప్రతిష్టను దెబ్బతీసేలా ఉండడంతో సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ సూచనల మేరకు ఎస్ఐ యూనస్ బృందం విచారణ జరిపింది. మేడారం టీవీ యూట్యూబ్ చానల్ యజమాని పరకాల సమ్మయ్య, ఈ సంభాషణను యూట్యూబ్‌లో పెట్టారని, పెద్ద కోమటిపల్లికి చెందిన జగన్ సదరు ఫోన్ కాల్‌లో మాట్లాడాడని విచారణలో వెల్లడైంది. దీంతో శనివారం హుజూరాబాద్ బస్సు డిపో క్రాస్ వద్ద పరకాల సమ్మయ్యను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు సీఐ తెలిపారు. అతడిపై భూపాలపల్లి జిల్లాలో రౌడీషీట్, ఐదు కేసులు ఉన్నాయని వెల్లడించారు. మేడారం సమ్మయ్య డబ్బులు సంపాదించాలని కుట్రపూరితంగా తన మనిషి జగన్ ద్వారా ఫోన్‌లో మాట్లాడించాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

'నాపై కావాలనే కుట్ర చేశారు'

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 15: తనపై యూట్యూబ్ చానల్ నిర్వాహకుడితో పాటు మరికొంత మంది కుట్రపన్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తిప్పారపు సంపత్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో సంపత్ మాట్లాడుతూ, ఓ వ్యక్తి ఫోన్‌లో తన అనుచరుడినంటూ నాగార్జున డెయిరీ యజమానిని రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన వ్యవహారంపై త్వరగా విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులకు అభినందనలు తెలిపారు విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రారపు రామచంద్రం, నాయకులు మల్లయ్య, సాయి అరుణ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

వీణవంక/ శంకరపట్నం/ గంగాధర, సెప్టెంబర్ 15: గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ సూచించారు. వీణవంక మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, డీజే నిర్వాహకులతో గణేశ్ నిమజ్జనంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత్రి 9 గంటల్లోగా నిమజ్జనం పూర్తయ్యేలా చూసుకోవాలని, ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరిగినా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, డీజే నిర్వాహకులు, మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులతో ఎస్ఐ కే రవి సమావేశం నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎవరైనా డీజేలు వాడితే అక్కడికక్కడే వాటిని సీజ్ చేస్తామని, డీజే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో నిర్వహించిన కమ్యూనిటీ పోలీసింగ్‌లో ఎస్ఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గణేశ్ నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదన్నారు. అవాంచనీయ ఘటనలు జరుగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా నిమజ్జనాన్ని నిర్వహించాలని సూచించారు.

జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 15: యువజన సంఘాల సమితి, వ్యవస్థాపకుడు జాతీయ యువజన అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు నిర్వహించిన సంస్మరణ సభలో జిల్లా వాసులు పాల్గొని నివాళులర్పించారు. ఇక్కడ జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు కిరణ్ కుమార్, శేఖర్, విష్ణు, తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి రాజేశ్వర్, యువజన సంఘాల సమితి బాధ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధ్వజారోహణ చేస్తున్న చేస్తున్న ఆలయ నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 15: జిల్లా కేంద్రంలోని కమాన్ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణ, మూలవిరాట్లకు ఫల-పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, విశ్వకర్మ పతాకావిష్కరణ చేశారు. బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ పూజలు, ధ్వజారోహణ చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులతో వాహనర్యాలీ నిర్వహించారు. సాయంత్రంలో ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్, ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రాచారి, మియాపురం వీరబ్రహ్మచారి, అనసూయ రమేశ్, ముత్తుజు సూర్యనారాయణ తదితరులున్నారు. అలాగే, హౌసింగ్ బోర్డు కాలనీ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి అనాథాశ్రమంలో విశ్వకర్మ ధ్వజం ఆవిష్కరణ, విశ్వకర్మల బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ సీపెల్లి వీరమాధవ్, ఆకుల ఉదయ్, కన్నూరి మహేశ్, పెందోట నర్సింహాచారి, శ్రీరామోజు రవీంద్రాచారి, కన్నూరి, మహేశ్, పెందోట నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల వారసులకు న్యాయం చేయాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 15 : జీవో నం.81, 85 ప్రకారం ఇప్పటికీ లబ్ధి పొందని గ్రామ రెవెన్యూ సహాయకుల వారసులకు న్యాయం చేయాలని 61ఏళ్లు నిండిన వీఆర్ఏల సంఘం జిల్లా నాయకుడు రాజలింగం కోరారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం జిల్లా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 20,555 మంది వీఆర్ఏలు ఉండగా, 16,758 మందిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. 61 ఏళ్లు దాటిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ మేరకు జీవో నం.81, 85 విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా తాము అధికారంలోకి వస్తే వారసులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించినా, ఇప్పటివరకు వీఆర్ఏల వారసులకు ఎలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 61ఏళ్లు దాటిన వీఆర్‌వోల వారసులకు ఉద్యోగాలివ్వాలని కోరారు. సమావేశంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వీఆర్‌వోల వారసులు తరలి వచ్చి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధిపై దాడి ప్రజాస్వామ్యానికి చేటు

కలెక్టరేట్, సెప్టెంబర్ 15: ప్రజా సంక్షేమం కోసం చట్టాలు చేసే ప్రజాప్రతినిధిపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి చేటు అని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఆకుల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కట్టరాంపూర్‌లో గల ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరులు ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధి ఇంటిపై దాడి చేసి, కల్లోలం సృష్టించడం దారుణమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలాంటి ఘటనలు ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే పార్టీలు, పంచాయితీలు అంటూనే ప్రతిపక్ష పార్టీలపై అధికార పార్టీ నేతలు బహిరంగ దాడులకు దిగడం శోచనీయమన్నారు. మొన్నటికి మొన్న సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కొంతమంది దుండగులు దాడి చేయడం, తాజాగా రాజధాని కేంద్రంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే నివాసంపై పట్టపగలే బరితెగించి దాడికి దిగడం ఏపరిణామాలకు దారితీస్తుందో గమనించాలన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్ యాటాకుల వెంకటేశం మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాల్సిన నేటి పాలకులు అధికారం ఉందనే ధీమాతో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై ప్రత్యక్ష దాడులకు పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. తెలంగాణ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నర్సింగోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం వీడి ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కక్ష పూరితంగా వ్యవహరించడం సముచితం కాదన్నారు. సమావేశంలో నాయకులు రవూఫ్, కీర్తిరావు, రఘునాయకుల రాంచంద్రారెడ్డి, జోగిన పల్లి వెంకటేశ్వరరావు, బరిగెల శ్రీనివాస్, జాలి జనార్దన్, తోట రాజయ్య, పెందుర్తి మహేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తాం

సంస్మరణ సభలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 15: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రెస్ భవనంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీతారాం ఏచూరి చూపిన మార్గాన్ని విడవకుండా పార్టీ కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముకుందరెడ్డి, సత్యం, బీమాసాహెబ్, సంపత్, నరేశ్‌పటేల్, దేవేంద్ర, రాణి, మోహన్‌నాయక్, రాజు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 15: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ స్థానిక నాయకులు గట్టు సతీశ్, మర్రి పోచయ్య, రాగుల శంకర్, బండి అరవింద్, కిశోర్, రమేశ్, రాములు, మధుకర్, నరేశ్, గంగన్న, అరవింద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

'మట్టి గణపతి' ఉత్సవ కమిటీకి ప్రోత్సాహక సన్మానం

మట్టి గణపతిని ప్రతిష్టించిన మిత్ర యూత్ నిర్వాహకులను సన్మానిస్తున్న హమ్ సంస్థ బాధ్యులు సాగర్ తదితరులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, సెప్టెంబర్ 15: గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక రాంనగర్‌లో 30 అడుగుల మట్టి గణపతి (లక్ష్మీవిద్య మహాగణపతి)ని ఏర్పాటు చేసిన మిత్ర యూత్ నిర్వాహకులను హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూడేండ్లుగా మిత్ర యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని నెలకొల్పడం అభినందనీయన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని అన్ని మండపాల్లో వచ్చే సంవత్సరానికి మట్టి గణపతినే నెలకొల్పాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు కొండకింది వేణుగోపాల్ శర్మ, సభ్యులు కంది రవికుమార్, మిత్రమండలి సభ్యులు అఖిల్, నిఖిల్, సాయి, భక్తులు పాల్గొన్నారు.

బొమ్మకల్ వాసికి జాతీయ పురస్కారం

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 15: మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు గాలిపెల్లి కుమార్ మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం-2024 అందుకున్నారు. బెంగళూర్‌కు చెందిన సోమల రాజు స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా బెంగళూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కుమార్‌కు పురస్కారం అందించి సత్కరించారు.

బాధిత కుటుంబానికి చేయూత

శంకరపట్నం, సెప్టెంబర్ 15: కేశవపట్నం గ్రామంలో ఇటీవల ఎరుకుల తిరుపతి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం అతడి కుటుంబాన్ని ఎంపీహెచ్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల సంపత్ పరామర్శించారు. 25 కిలోల బియ్యంతో పాటు రూ.500 ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ ఆకుల రాజ్‌కుమార్, గుండారపు అనిల్‌కుమార్, తాండ్ర సంతోష్ ఉన్నారు.

ఆటో సంఘర్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

తెలంగాణచౌక్, సెప్టెంబర్15: రవాణా రంగ కార్మికుల సమస్యలపై ఈ నెల 23, 21 తేదీల్లో తలపెట్టిన ఆటో సంఘర్షణ యాత్ర కరపత్రాన్ని సీఐటీయూ నాయకులు కేబుల్ బ్రిడ్జి వద్ద గల కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రవి, వెంకటేశ్, తిరుపతి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడి శ్రీనివాస్

శంకరపట్నం, సెప్టెంబర్ 15: మండలంలోని కరీంపేట్ గ్రామంలో గౌడ సంఘం కమిటీకి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు గుర్రం తిరుపతి, గుర్రం ప్రభాకర్, మూల ఆంజనేయులు, గుర్రం శ్రీనివాస్, పంతంగి కొమురయ్య, గుర్రం వీరస్వామి, గుర్రం వీరమల్లు, గుర్రం రవి, గుర్రం సాగర్, గుర్రం విష్ణు, గుర్రం చందు, గుర్రం పవన్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన ప్రకటనలను కొరకు సులభమైన మార్గం... మన
నమస్తే తెలంగాణ
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

భారీ వాహనాల దారి మళ్లింపు

మానకొండూర్, సెప్టెంబర్ 15: మానకొండూర్ చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు భారీ వాహనాల దారిమళ్లింపు కొనసాగుతుందని మానకొండూర్ ఇన్‌చార్జి సీఐ స్వామి తెలిపారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న భారీ వాహనాలు అలుగునూర్ చౌరస్తా నుంచి హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి, వరంగల్ నుంచి కరీంనగర్ వస్తున్న వాహనాలు ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా కరీంనగర్ చేరుకోవాలని తెలిపారు. దారిమళ్లింపు అనుమతులపై సంబంధిత శాఖల అధికారులు డీటీవో, పీడీ ఎండీసీతో పాటు గ్రానైట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కు సమాచారం అందజేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్‌జామ్ కాకుండా భారీ వాహనాల యజమానులు, డ్రైవర్లు సహకరించాలని కోరారు.

వలకు చిక్కిన కొండచిలువ

గన్నేరువరం, సెప్టెంబర్ 15: మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు రాజేశం మండల కేంద్రంలోని పెద్ద చెరువు కింద ఎల్ఎండీ బ్యాక్ వాటర్‌లో చేపల కోసం వల వేయగా, కొండచిలువ చిక్కింది. దీంతో భయాందోళనకు గురై తోటి మత్స్యకారులతో కలిసి దానిని హతమార్చినట్లు తెలిపారు. కొండచిలువ సుమారు మూడు మీటర్ల పొడవు ఉందన్నారు.

కుంటలో పడి వృద్ధుడి మృతి

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 15: ముంజంపల్లి గ్రామానికి చెందిన కాసం రాంరెడ్డి (80) ఆదివారం బహిర్భూమికి గ్రామ శివారులోని ఈదుకుంటకు వెళ్లగా, ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మితో పాటు కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఓనం వేడుకలు

వీణవంక, సెప్టెంబర్ 15: మండల కేంద్రంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేరళ ఆచారాలు, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలు జరుపుకొన్నారు. ఓనంను కేరళలో వ్యవసాయ పండుగ అంటారని, దీన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీజిత్, వినోయ్, ప్రశాంత్, నిష, మంజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 15: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో తిమ్మాపూర్‌లోని బాలుర మైనారిటీ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారని గురుకుల ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. అండర్ 14, 17 ఖోఖో విభాగంలో ప్రథమ స్థానం, అండర్ 14 కబడ్డీలో ద్వితీయ, అండర్ 17లో 100,200 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీయ, అండర్ 14లో 200 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల, పాఠశాల కో ఆర్డినేటర్స్ కె.అనిత, ఎ.రత్నాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు మొయినొద్దీన్, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకి స్వాగత సన్మానం

సైదాపూర్, సెప్టెంబర్ 15: సైదాపూర్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిని బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండలాధ్యక్షుడు ఎల్కపల్లి రవీందర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు.

ఇంజినీర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఎస్ఈ కె. లచ్చయ్య, డీపీఆర్ఈ చంద్రశేఖర్, ఇరిగేషన్ రిటైర్డ్ సీఈ తులసీదాస్, ఇంజినీర్లు

విద